# ఒకరోజు గడిచింది

## రాజ్యలక్ష్మి కొలాస్కర్

సంచిలో ఊరగాయ సీసాలు, జామ్ సీసాలు, ప్యాకెట్లు అన్నీ అందుబాటులో వున్నాయో లేవో చూసుకుని మొదటి తలుపు తట్టింది కృష్ణవేణి రెండు నిముషాలకు తలుపు తెరుచుకుంది

"బాగున్నారా విజయగారూ!" చిరునవ్వుతో పలకరించింది

"సమయానికి వచ్చావు దేవతలాగ రా తల్లీ" ఆనందంగా ఆహ్వానించింది విజయ

"ఏమయిందండీ ?" బరువుగా వున్న సంచీ క్రిందపెట్టి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంది కృష్ణవేణి

"మా యింటికి లంచ్‌కి గెస్ట్స్ వస్తున్నారు కృష్ణవేణీ! ఈ రాక్షసి నన్ను ఒక్కపనీ చేసుకో నివ్వటంలేదు కొంచెం ఒక్క అరగంట దీన్ని పట్టుకోతల్లీ! నీకు పుణ్యముంటుంది" కృష్ణవేణి చేతుల్లో పదినెల్ల కూతుర్ని వదిలేసి వంటింట్లోకి పరిగెట్టబోతున్న విజయ చెయ్యి పట్టుకుని ఆపింది కృష్ణవేణి

"ఏమిటండీ! ఇది అన్యాయం! మీది మొట్ట మొదటి ఇల్లు మీరు ఇక్కడే నన్ను కూర్చో బెట్టేస్తే"

"ఇప్పుడే వచ్చేస్తున్నా" ఆమె మాటలు పూర్తి చెయ్యనివ్వకుండానే తన చెయ్యి వదిలించేసుకుని మాయమయిపోయింది విజయ

తిట్టుకుంటూ పాప నెత్తుకుని కుర్చీలో కూలబడింది కృష్ణవేణి కాస్త ముఖపరిచయంవున్న వాళ్ళ ఇంటికి ముందు వెళ్దామని వస్తే ఆదిలోనే హంసపాదులాగ తగులుకుందీ మహాతల్లి ఇస్త్రీ చీరమీద పాప ఎక్కి తొక్కుతుంటే నిస్సహాయంగా చూస్తూ కూర్చుంది కస్టమర్లతో పరుషంగా మాట్లాడి కంపెనీ పేరు పాడుచేస్తే తన ఉద్యోగం వూడుతుంది లేకపోతే మెత్తని వాళ్ళని చూస్తే మొత్తబుద్ధవుతుందన్న సామెతగా ప్రవర్తిస్తారు జనం అంతా తన దురదృష్టం పాపని భుజాన వేసుకుని జోకొడుతూ మెల్లగా అటూ ఇటూ తిరగసాగింది ఓ గంటసేపటికి పాప నిద్రపోయింది

"విజయగారూ!" మెల్లగా పిల్చింది

"ఏమిటీ ?" గరిటె చేతిలో పట్టుకుని వచ్చిందావిడ

"పాప నిద్రపోయింది ఎక్కడ పడుకో బెట్టను ?"

బెడ్‌రూమ్‌లో పాపని పక్కమీద వేసి వచ్చింది విజయ

"ఇంతసేపు కూర్చోబెట్టేసారు మీరు కనీసం యాభై రూపాయల బిల్లు చెయ్యాలి" బ్రతిమాలు కుంది కృష్ణవేణి

"స్టౌ ఆర్పేసి వస్తానుండు" అని వెళ్లి తిరిగొచ్చి,

"ఏమేం వున్నాయి ?" సంచి దగ్గర కూర్చుంది విజయ

"మిక్స్‌డ్ ఫ్రూట్‌జామ్, మాంగోజామ్, గోంగూర్, ఆవకాయ, నిమ్మకాయ, ఫ్రెష్‌గా సాంబారుపొడి చారుపొడి" అన్నీ ఒక్కొక్కటి పైకి తీసి చూపించింది




"ఏం తీసుకోమంటావు కృష్ణవేణీ! అమ్మ ఎలాగూ సంవత్సరానికి సరిపడా పచ్చళ్ళు పంపిస్తుంది మా ఇంట్లో బ్రెడ్ ఎవరూ తినరు ఇంక జామ్ ఏం చేసుకోను నేను ? పోనీ ఒక సాంబారుపొడి పాకెట్ ఇవ్వు"

ఉసూరుమంది కృష్ణవేణి "అన్యాయమండీ! ఈపాటికి నాలుగు ఇళ్ళకి వెళ్ళేదాన్ని"

"అంతగా బాధపడిపోకమ్మాయ్! రోజూ కూర్చోవుగా మా యింట్లో!"

సీసాలు, పొట్లాలు మళ్ళీ సంచిలో సర్దుకుని బయటపడింది కృష్ణవేణి వడివడిగా నడిచి పక్కింటి బెల్ కొట్టింది

అయిదు నిమిషాలు నించుని వెళ్ళిపోదామను కుంటుండగా తలుపు తెరుచుకుంది

"ఏం కావాలి ?" కొట్టినట్లు అడిగింది తలుపు తీసినావిడ

"ఊరగాయలు, జామ్, సాంబారు పొడి ఉన్నాయండీ! ఏమైనా తీసుకుంటారా మీరు ?"

"తెల్లవారిందో లేదో అప్పుడే నీవు రెండోదానివి పెద్ద అర్జెంటు పనున్నట్లు వచ్చి బెల్ కొడతారు స్నానం చేసేదాన్ని హడావిడిగా కానిచ్చి పరిగెట్టు కుంటూ వచ్చి తలుపు తీశాను ఇలా మా ప్రాణాలు తీసేబదులు అమ్ముకునేవాళ్ళందరిలాగానే అరుస్తూ తిరగొచ్చుగా! కావల్సినవాళ్ళు పిల్చి తీసుకుంటారు!"

చాచి చెంపదెబ్బ కొట్టాలన్న కోరిక బలవంతంగా నిగ్రహించుకుంది కృష్ణవేణి "ఇన్ని మాటలనే బదులు వద్దని ఒక్క ముక్క చెప్తే సరిపోతుంది కదండీ!"

"పౌరుషానికి మాత్రం కొదవలేదు ఏవున్నా లేకపోయినా" కృష్ణవేణి ముఖంమీదే తలుపేసేసింది

"ఛీ! అడవి మృగాలు నయం ఇలాంటి మనుషులకన్న కాస్త గౌరవం ఇస్తే వీళ్ళ ధన రాసులేం తరిగిపోతాయో!" ఇటువంటి సంఘటనలు కృష్ణవేణి నిత్యజీవిత భాగాలైపోయినా ఒక్కోసారి ముళ్ళలా పొడిచి బాధిస్తుంటాయామె మనసును

"ఈ బ్యాగ్ మోసి మోసి కొన్నాళ్ళకి నా చేతులు పాదాలవరకు సాగిపోతాయేమో" సంచీ ఒక చేతిలోంచి ఇంకో చేతిలోకి మార్చుకుంటూ అనుకుంది ఓ అరఫర్లాంగు దూరం నడిచి మరో తలుపు తట్టింది, "ఇక్కడేం తినాలో భగవంతుడా" అను కుంటూ అంతలోనే అది దమయంతమ్మగారిల్లని గుర్తొచ్చింది "హమ్మయ్య" అనుకుంది తలుపు తీసి కళ్ళజోడు పైకి తోసుకుంటూ చూసింది దమయంతమ్మ

"ఎవరూ ?"

"నేను పిన్నిగారు కృష్ణవేణిని!"

"నువ్వామ్మాయ్! రా లోపలికి! చాన్నాళ్ళ యింది నువ్వొచ్చి ఇటు రావట్లేదు ఏమిటి ?"

రిలీఫ్‌గా చాపమీద కూర్చుంది కృష్ణవేణి ఇక్కడ కొంచెం టైమెక్కువగా గడిపినా దానికి తగ్గ ఫలితం వుంటుంది దమయంతమ్మగారి కొడుకూ, కోడలూ, పిల్లలూ అందరూ తొమ్మిదింటికల్లా ఇంట్లోంచి బయటపడాలి అందుకని టిఫిన్ పని పెట్టుకోకుండా బ్రెడ్‌జామ్ బట్టర్ తినేసి భోజనం బాక్సుల్లో తీసుకుని వెళ్తారు కృష్ణవేణి వచ్చినప్పుడల్లా జామ్ బాటిల్స్ దండిగా కొంటుందావిడ

"పిన్నిగారూ! కొంచెం మంచినీళ్లివ్వండి మీకు పుణ్యముంటుంది!"

మంచినీళ్ళిచ్చి కృష్ణవేణి ప్రక్కనే కూర్చుందావిడ

"ఏం తీసుకుంటారు పిన్నిగారూ! ఈసారి మామిడిపళ్ళ జామ్ తెచ్చాను చూస్తారా?"

"చూద్దాంలేమ్మాయ్! ఎప్పుడొచ్చినా కాలు నేల నాన్నివ్వకుండా హడావిడి చేసేస్తావు ఏమిటంత ఖంగారు?" ఆవిడకి విపరీతమయిన ఖబుర్లపిచ్చి

"ఏం చెయ్యను పిన్నిగారూ! నాకూ కూర్చోవాలనే వుంటుంది అంతలోనే ఓ రెండు సీసాలు ఎక్కువ అమ్మితే నాలుగు డబ్బులు కమీషన్ ఎక్కువ వస్తుందనే ఆశ కూర్చోనివ్వదు"

"అవును కానమ్మాయ్! కుదురుగా కూర్చుని చేసుకునే ఉద్యోగంలో కుదురుకోక ఇలా ఇళ్ళట్టుకు తిరిగే పనిలో చేరావేమిటి?"

నవ్వింది కృష్ణవేణి "అయ్యో పిన్నిగారూ! మీరింకా మీ కాలంలోనే వున్నారు ఈ రోజుల్లో ఉద్యోగం దొరకటమే గగనంగా వుంది ఇంక మనం కోరుకునే వుద్యోగంమాటా! అయినా హానాకాలం చదువుకు ఇదే అదృష్టం పిన్నిగారూ ఇక్కడ కాబట్టి ఇదైనా దొరికింది అదే ఏ ఢిల్లీలోనో అయితే ఇంగ్లీషు గలగలా మాట్లాడే గ్రాడ్యుయేట్స్ కావాలి ఈ ఉద్యోగానిక్కూడా!"

"నువ్వేం చదువుకున్నావు?

"ఎనిమిదో తరగతి"

"నువ్వీపని చెయ్యకపోతే ఇల్లు గడవదేమిటమ్మా! ముచ్చటగా ఉండేదానివి ఎండనబడి నల్లగా కప్పేసిపోయావు"

కృష్ణవేణి ముఖంలో విషాదం కమ్ముకుంది "గడవదు పిన్నిగారూ!"

ఆవిడ కృష్ణవేణి పాదాల మట్టెలవంక మెడలో నల్లపూసలవంక అర్థవంతంగా చూసింది కృష్ణవేణి ఏం మాట్లాడకపోయేసరికి తనే అడిగేసింది

"మీ ఆయనేం చేస్తాడు?"

"ఏం చెయ్యరండీ"

బుగ్గలు నొక్కుకుందావిడ "అదేమిటమ్మా?"

"ఇంతకుముందు చేసేవారు పిన్నిగారూ! చేసింది చిన్న వుద్యోగమే అయితేనేం! పంచభక్ష్య పరమాన్నాలు లేకపోయినా ఉన్నదాంట్లో హాయిగానే గడిచేది స్నేహితులు ఆయనకి తాగుడు అలవాటు చేశారు చవగ్గా వస్తుంది కదాని కల్తీసారా తాగారు ఒకసారి చాలామంది చచ్చిపోయారు ఈయనకి కళ్ళు పోయాయి నాకీ పని దొరికేవరకూ అష్టకష్టాలూ పడ్డామనుకోండి దీనికైనా టెన్త్ క్లాస్ పాసవాలన్నారు అక్కడికెళ్ళి అనేక విధాలుగా బతిమాలుకుంటే నేను కొంచెం నదురుగా వున్నానని, మాట స్వచ్ఛంగా వుందని ఇచ్చారు నా సోదికేమొచ్చె! ఏం తీసుకుంటారో చెప్పండి పిన్నిగారూ!"

కృష్ణవేణిమీద జాలి పొంగిపొర్లుతుంటే అన్నీ ఒక్కొక్కటి కొనేసింది దమయంతమ్మ

"పిన్నిగారూ! మధ్యాహ్నమయిపోయింది మీరేమీ అనుకోనంటే కొంచెం ఇక్కడ కూర్చుని నేను తెచ్చుకున్న టిఫిన్ తినేస్తానండీ!"

"అయ్యో! దానికేం భాగ్యమమ్మా! డైనింగ్ టేబిల్ దగ్గరకు రా"

"వద్దులెండి పిన్నిగారూ! ఇక్కడే కూర్చుంటాను" మొహమాట పడింది కృష్ణవేణి

* * *

ఎర్రటి ఎండలో కృష్ణవేణి కస్టమర్ల కోసం మళ్ళీ వేట మొదలెట్టింది ఒకావిడ తలుపుతీస్తూనే విరుచుకుపడింది "ఏమ్మా! ఓట్టమధ్యాహ్నం వచ్చి బెల్ కొడతావు నిద్రపోతుంటారేమోననే జ్ఞానమైనా లేదు నీకు పనయి ఇలా నడుం వాల్చానో లేదో మీ బెడద మొదలు అయినా ఈ మహానగరంలో షాపులే కరువయ్యాయా మాకు మీలాంటివాళ్ళు తెచ్చే చవకబారు సరుకు కొనటానికి! మళ్ళీ ఎప్పుడూ ఇలా వచ్చి డిస్టర్బ్ చెయ్యొద్దు వెళ్ళు!" ధామ్మని మూసేసింది తలుపు

కొంతమందికి ఇదో జాడ్యం బస్సులకీ, ఆటోలకీ డబ్బులు తగలేసి అందంగా కన్పించె షాపుల్లో ముచ్చటగా పేర్చిన వస్తువుల్ని వాటిధరతో పాటు షాపువాళ్ళ ఎస్టాబ్లిష్‌మెంటు ఛార్జీలు కూడా చెల్లించి కొనుక్కుని ఇంటికొచ్చి, వాటినిండా ఒకవేళ బూజున్నా, పురుగులున్నా, బరువు తక్కువున్నా 'మన ఖర్మ' అని సరిపెట్టుకుని వూరుకుంటారు శ్రమలేకుండా తక్కువ ధరలో కాళ్ళ దగ్గరకొచ్చిన ప్రతి వస్తువూ నాసిరకందే!

మొదట్లో ఇటువంటి సంఘటనలకి కృష్ణవేణి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగేవి మూసిన తలుపు ముందే నించుని ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకుని దడదడలాడే గుండెలతో మరో తలుపు తట్టేది రాను రానూ పువ్వులాంటి మనసు రాయిలాగా మారిపోతోంది ఇంకొన్నాళ్ళయితే ఆ రాయి కూడా మాయమయిపోతుందేమో నన్పిస్తుంది కృష్ణవేణికి

మెల్లగా నడుచుకుంటూ వెళ్ళి మరో తలుపు తట్టింది ఇంటావిడ తలుపు తియ్యగానే తన పారం అప్పగించింది కృష్ణవేణి

"ఏవీ చూపించు?"

చూపించింది

"ఏం చేసుకుంటారు దీన్ని?" జామ్‌సీసా చూపించి అడిగిందావిడ

"బేకరీల్లో, కోడిగ్రుడ్ల షాపుల్లో బ్రెడ్ అమ్ముతారు చూడండి! దాన్ని వేడి చేసుకొని వెన్న, ఈ జామ్ రాసుకుని తింటారు పిల్లలు బాగా ఇష్టపడతారు పొద్దున్నపూట టిఫిన్ పెద్దశ్రమ లేకుండా అయిపోతుంది" ఓపికగా వివరించింది కృష్ణవేణి "రుచి చూస్తారా?" శ్యాంపిల్ బాటిల్ తీసింది


"అది వద్దులేగాని ఆ గోంగూర పచ్చడి చూపించు!" రుచి చూసి చెయ్యి చీరకి తుడుచుకుంటూ అడిగిందావిడ


"ఎంత ఈ సీసా?"

"ఏడు రూపాయలండీ"

"ఏమిటీ! పిడికెడంత పచ్చడి లేదు ఏడు రూపాయలా? ఏం నడమంత్రం కాలం తల్లీ! నాలుగు రూపాయలకిస్తే తీసుకుంటాను"

"నేను కాదుకదండీ దీన్ని తయారుచేసింది? ఎవళ్ళు చేసి ఫలానా ధరకి అమ్మమంటే ఆ ధరకి



అమ్మితాను నేను నేనెలా తగ్గించగలనండీ! బజార్లో కొంటే పది రూపాయలపైనే వుంటుంది ''

''అంత డబ్బు పోసి పచ్చళ్ళు సంసారు లెవరూ కొనలేరు తల్లీ పట్టుకెళ్ళు ''

సంచి సర్దుకోసాగింది కృష్ణవేణి ఇంతలో ఇంకొకావిడ వచ్చిందక్కడికి

''రండి వదినగారూ!'' ఆహ్వానించింది ఆ ఇంటావిడ

''ఎవరీ పిల్ల?'' వచ్చినావిడ అడిగింది

''ఊరగాయలూ, పొళ్ళూ అవీ అమ్మకానికి తెచ్చింది ధర మరీ ఎక్కువగా వుందని ఏం తీసుకోవటంలేదు ''

''వదినగారూ! మీరు మరీ అమాయకులండీ! ఇలాంటివాళ్ళని ఇళ్ళల్లోకి రానివ్వకూడదు ఇదో ఎత్తు వీళ్ళు ముఠాలుగా వచ్చేస్తూవుంటారు. ఇలా ఏదో వంకన ఒకళ్ళొచ్చి అనుపానూ కనుక్కెళ్తారు తర్వాత మిగతావాళ్ళొచ్చి ఇల్లు దోచుకుంటారు'' గీతోపదేశం చేసిందావిడ

కృష్ణవేణి ఆవిడని మింగేసేలా చూసింది ఇటువంటి మనుషులతో మాట్లాడటంవల్ల అనవసర ఘర్షణ తప్ప ప్రయోజనం వుండదని తెలుసు అందుకే ఇంటావిడ అమ్మో అమ్మో అంటూ గుండె బాదుకుంటూంటే ''ఇకొంచెం గట్టిగా కొట్టుకోండి'' అని కసిగా అనుకుని సంచి తీసుకొని బయటకొచ్చేసింది

''ఏ ముహూర్తాన బయలుదేరానో! ఈ రోజన్నీ ఇలాంటి ముఖాలు ఎదురవుతున్నాయి'' నిస్పృహగా అనుకుంది కనీసం అమ్మకం బాగా జరిగితే శరీర శ్రమ అంతగా బాధించదు ఒక్కోచోట ఇలాంటి మాటలు విన్నాగాని ''వ్రతం చెడ్డా ఫలం దక్కింది'' అన్న సంతృప్తి మిగుల్తుంది

పరధ్యానంగా మరో గుమ్మం ఎక్కి బెల్ కొట్టింది లుంగీ బనియన్‌లోవున్న నడివయస్కుడొకాయన తలుపు తీశాడు కృష్ణవేణి మాటలు వింటూనే అతని ముఖం వికసించింది

''లోనికి రండి ముందు ఎదురెండ కాల్చేస్తోంది'' మర్యాదగా ఆహ్వానించాడు

కృష్ణవేణి లోనికి అడుగుపెట్టగానే తలుపు మూశాడు ఆమె భయపడలేదు ఎవరైనా హద్దు మీరితే ఎలా ఎదుర్కోవాలో ఆమెకు బాగా తెలుసు

సంచీలోంచి సీసాలు ప్యాకెట్లు తీస్తూ ఒక్కోదాని గురించి చెప్తోంది కృష్ణవేణి అతను ఆమె మాటలు వినకుండా ఆమెవంకే చూస్తున్నాడు

''సరైన సమయానికి వచ్చావు మా ఆవిణ్ణి ట్రైనెక్కించి ఇప్పుడే వచ్చాను'' అతని గొంతులో కొంటెతనం

తలెత్తి అతనివంక తీక్షణంగా చూసింది

''ఎందుకలా చూస్తావు? ఆవిడ లేనప్పుడు ఊరగాయ అన్నం, జామ్ బ్రెడ్డేగా గతి?''

''అయితే మీక్కావలసినది తీసుకోండి! నేను త్వరగా వెళ్ళాలి!''

''ఎందుకంత తొందర? అలసిపోయినట్టు కన్పిస్తున్నావు కొంచెంసేపు కూర్చుని వెళ్ళొచ్చు కదా!''

''మీ దయకి చాలా కృతజ్ఞురాలిని ఆ

# ఒకరోజు గడిచింది

కూర్చునేదేదో మా ఇంట్లోనే కూర్చుంటాను దయచేసి మీకేవేవి కావాలో చెప్పండి ''

''నాక్కావాల్సింది నిజంగా ఇస్తావా?''

తియ్యగా నవ్వింది కృష్ణవేణి ''అడగమంటున్నానుగా''

ఐసయిపోయాడతను ''ఒక్క గంట నాతో గడిపివెళ్ళు వందరూపాయలిస్తాను ఎన్ని గుమ్మాలు ఎక్కి దిగితే నీకు వందరూపాయల కమీషనొస్తుంది!''

''మీరెంత మంచివారండీ! ఒక్క గంటకి వందరూపాయలిస్తానంటున్నారు అవును! ఆ ఫోటోలో మీ ప్రక్కన మీ ఆవిడేమిటి! ఎంత అందంగా వుంది! మా వారికి అందమైన పరాయి ఆడవాళ్ళంటే మహా మోజు ఊర్నించి వచ్చాక ఆవిణ్ణి మావారిదగ్గరకోరాత్రి పంపించకూడదూ! రెండువందలిస్తారేమో!''

''యూ డర్టీబిచ్'' పళ్ళు కొరికాడతను స్పీడ్‌గా గాలిలోకి లేచిందతని చెయ్యి కృష్ణవేణి

## ఆవులపై వానజల్లులు!

పాలిచ్చే ఆవులకు మేతతోపాటు వాతావరణ పరిస్థితులు కూడా ముఖ్యమే ముఖ్యంగా పశ్చిమ జర్మనీ వంటి దేశాలనుండి ఉష్ణమండల దేశాలు దిగుమతి చేసుకున్న ఆవులకు ఇది బాగా వర్తిస్తుంది బెర్లిన్ టెక్నికల్ యూనివర్శిటీవారి సహకారంతో బంగ్లాదేశ్‌లో జరుపుతున్న ప్రయోగాలలో మధ్య యూరావు నుండి దిగుమతి చేసుకున్న ఆవులకు కృత్రిమ వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ఈ ఆవుల మీద వానజల్లులు వర్షిస్తుంటాయి ఈ గోశాల పైకప్పును కూడా ప్రత్యేకంగా తయారుచేశారు మేత విషయంలో కూడా తగిన శ్రద్ధను తీసుకుని ఆధునిక పద్ధతుల ననుసరిస్తున్నారు ఈ జాగ్రత్తల వలన యూరావు ఆవులు బంగ్లాదేశ్ ఆవులకంటే ఎక్కువ పాలిస్తున్నాయని వారు ప్రకటించారు

చెంప పగలగొట్టటాన్కి ఆ చెయ్యిని గట్టిగా పట్టుకుంది

''మాటలు సరిగా రానియ్ రాస్కెల్! పరాయివాడి పెళ్ళాం అందరి సొత్తు, నీ పెళ్ళాం మాత్రం పతివ్రత? నువ్వేమైనా గుడ్డివాడివా? నా మెళ్ళో ఇంతలావు నల్లపూసలు కన్పించటంలేదూ!''

''సంగనాచిలాగా మాట్లాడుతున్నావు నేను తలుపులేస్తుంటే ఎందుకూరుకున్నావు? అమాయకత్వమా లేకపోతే నా ఆఫర్ చాల్లేదా?''

''నీ పరువు బజార్న పడుతుందని తలుపు వెయ్యనిచ్చాను నువు మరీ అద్వాన్నయితే ఈ ఆవకాయ సీసా నీ నెత్తిన పగలగొట్టి ఆ కారం నీ కళ్ళల్లోకొస్తే, నువు లబోదిబో మంటుంటే అందరూ నవ్వరా? అనక మీ ఆవిడకి చెప్తే ఆవిడ నీ చర్మం ఒలిచి చెప్పులు కుట్టించదా? 'సేల్స్ గర్ల్స్' అంటే ఇంత లోకువా? నేను ఈ వస్తువులు అమ్మటాన్కి వచ్చానుకాని నా శరీరం అమ్ముకోటాన్కి కాదు తలుపు నువు తీస్తావా? నేనే తీసుకోనా?''

కృష్ణవేణి కళ్ళల్లోకి చూశాడతను అక్కడ కోపం లేదు అసహ్యం, కాఠిన్యం, తనపై తనకున్న నమ్మకం, పట్టుదల కన్పించాయి

''రాక్షసి'' గొణుక్కుంటూ తలుపు తీశాడతను

''మీలాంటి రాక్షసుల మధ్య బ్రతకాలంటే రాక్షసివే అవ్వాలి మరి పరాయి సొమ్ముకి కక్కుర్తి పడకుండా బతకటం మీకెప్పుడు చేతనవుతుంది? ఛీ ఛీ!'' అసహ్యంగా అనేసి బయటకొచ్చేసింది కృష్ణవేణి

రోడ్డుమీద నడుస్తోంది ఇంకెవరింటికీ వెళ్ళాలన్పించటంలేదామెకి పార్కు కన్పిస్తే అటువైపు నడిచాయి కాళ్ళు చెట్టుకింద కూర్చుని మోకాళ్ళలో ముఖం దాచుకుంది ఇంటిదగ్గర ఏడిస్తే పశ్చాత్తాపంతో కుంగిపోతున్న భర్త తనే దీనికంతటికీ కారణమని మరీ బాధపడతారు అతని సమక్షంలో సాధ్యమైనంతవరకూ సంతోషంగా వుండటాన్కి ప్రయత్నిస్తుంది

ఒక అరగంట తరువాత నెమ్మదిగా లేచింది కంపెనీకి వెళ్ళి డబ్బు, సరుకు హేండోవర్ చేసేసి ఇంటివైపు నడిచింది ప్రొద్దుట్నించీ సాయంత్రం వరకూ తట్టే తలుపులలో ఇదొక్కటే కృష్ణవేణి మనసులో బాధ భయం లేకుండా తట్టగలిగేది

''ఎవరూ?'' దామోదరం కంఠం విన్పించింది

''నేనండీ''

తలుపుతీసి సంతోషంగా ఆహ్వానించాడు ''రా కృష్ణా!''

ప్రొద్దున్న తొమ్మిది గంటలనుంచీ ఆమెకోసం ఎంతగా ఎదురుచూశాడో ఆఖరికీ ఆ నిరీక్షణ ముగిసినందుకు ఎంతటి రిలీఫ్ పొందుతున్నాడో ఆ రెండు మాటల్లో వ్యక్తీకరించాడు ఆ రెండు మాటలే ప్రతి సాయంత్రం కృష్ణవేణి పడిన శ్రమనంతా మరిపిస్తాయి

''టీ తాగుదాం రా కృష్ణా!''

''ఎందుకండీ మీరు చెయ్యటం? ఎన్నిసార్లు చెప్పినా వినరు ఏ చెయ్యి కాల్చుకుంటారో అని భయం నాకు''

''హాయిగా ఇంట్లో కూర్చోవలసినదానివి నా పుణ్యమా అని నానా బాధలు పడుతున్నావు కనీసం ఈ మాత్రమైనా చెయ్యనియ్యి కృష్ణా! ప్చ్! ఆ రోజు కళ్ళు కాకుండా మనిషినే పోతే ఎంత బాగుండేది నీకు కనీసం సగం అవస్థ తప్పేది''

''ఏం మాటలండీ! ఇలాంటి ఆలోచనలతో, మాటలతో మిమ్మల్ని మీరు హింసించుకుని నన్ను హింసించకండీ! రోజంతా ఎప్పుడు సాయంత్రమవుతుందా? ఇంటికెళ్దామా! అనే ఆత్రంతో పని చేస్తాను మీరిలా మాట్లాడితే ''

''సారీ కృష్ణా! ఇంకెప్పుడూ అనను నీవు కూడా నన్ను వారించకు నీకు టీ చేసి వుంచటం నాకు సంతృప్తిగా వుంటుంది పద!''

''దేవుడా! రోజంతా ఏ విధంగా గడిచినా ప్రతిరోజుకీ ముగింపు మాత్రం ఇలాగే వుండనియ్యి స్వామీ!'' కన్పించని దేవుణ్ణి వేడుకుంటూ వంటింట్లోకి నడిచింది కృష్ణవేణి ★